అసైన్డ్, భూదాన్ భూములను పేదలకు పంపిణీ చేయాలి

❖ *తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడు జిలుకర రవికుమార్ డిమాండ్.*



దశ, హైదరాబాద్ : రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉన్న అసైన్డ్, ప్రభుత్వ, భూదాన్ భూములను ప్రభుత్వం గుర్తించి స్వాధీనం చేసుకుని అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325 పరిధిలోని సుమారు 388 ఎకరాల భూముల అంశంపై ప్రభుత్వం చేపట్టిన సర్వేను ప్రస్తావించారు. ఈ భూములను అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఎర్రవల్లి భూములపై రెవెన్యూ అధికారులు ఇప్పటికే సర్వే నిర్వహించి హద్దులను పరిశీలించినట్లు తాజా సమాచారం వెల్లడిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అసైన్డ్, ప్రభుత్వ భూముల పరిస్థితిపై సమగ్రంగా పరిశీలన జరపాలని రవికుమార్ కోరారు.

ఐఏఎస్ అధికారిణి దేవసేన సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ అన్ని జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అన్యాక్రాంతమైన భూములను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు లేదా ఇతరుల ఆధీనంలో ఉన్నట్లు తేలిన ప్రభుత్వ, అసైన్డ్ భూములను చట్టపరమైన ప్రక్రియ ద్వారా తిరిగి స్వాధీనం చేసుకుని, అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఆరుట్లలో ఘనంగా వినాయక నిమజ్జనం

❖ *రూ.1.11 లక్షలకు లడ్డు వేలం*



దశ, మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో చండీశ్వర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. డోలు, డప్పుల దరువులు, వివిధ వేషధారణలతో యువత నిర్వహించిన ఊరేగింపు గ్రామంలో సందడి నెలకొల్పింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. నిమజ్జనానికి ముందు నిర్వహించిన లడ్డు వేలం పాటలో ప్రధాన లడ్డు రూ.1,11,000లకు చెరుకు పర్వతాలు దక్కించుకున్నారు. చిన్న లడ్డును చెరుకు వెంకటేష్ రూ.37,000లకు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో కురుమ యాదవ సంఘం కుల పెద్దలు, చండీశ్వర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



"వ్యసన విముక్తికి వెన్నెల వెలుగు!"

శ్రీరాంపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

దశ, సిద్దిపేట : శ్రీరాంపూర్ గ్రామంలో హైద్రాబాద్ తట్టి అన్నారం పరిధిలోని వెన్నెల రిహాబిలిటేషన్ సెంటర్ అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలను గుర్తించి అవసరమైన వైద్య సలహాలు, సూచనలు అందించారు. మద్యం, మాదకద్రవ్యాలు, ఇతర వ్యసనాల వల్ల కలిగే అనారోగ్య సమస్యలతో పాటు కుటుంబ, సామాజిక జీవితంపై వాటి ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యసనాలకు బానిసైన వారికి సకాలంలో చికిత్స, పునరావాసం అందిస్తే సాధారణ జీవితంలోకి తీసుకురావచ్చని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు అవసరమైన వారికి వైద్య సహాయం అందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని వెన్నెల రిహాబిలిటేషన్ సెంటర్ ప్రతినిధులు తెలిపారు. శిబిరానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

ఎస్టీయూటీఎస్ఏకు మల్‌రెడ్డి అభినందనలు



❖ *టీచర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి*

దశ, రంగారెడ్డి : తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (STUTSA) 80 ఏళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలు చిరస్మరణీయమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అదే స్ఫూర్తితో సంఘం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో ఎస్టీయూటీఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన 80వ వసంత వేడుకలకు మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్టీయూటీఎస్ఏ ఉపాధ్యాయులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబును ఎస్టీయూటీఎస్ఏ ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

❖ *వంటగదులు, నిల్వ ప్రాంతాల్లో అపరిశుభ్రత.. ఆహార నమూనాల సేకరణ.*



దశ, సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. 7 మిడ్‌వే ప్లాజా, లిటిల్ విలేజ్ బిర్యానీ, అన్నపూర్ణ మెస్‌లలో వంటగదులు, రిఫ్రిజిరేటర్లు, ఆహార నిల్వ ప్రాంతాలను పరిశీలించారు. తనిఖీల్లో ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్రత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అనుమానాస్పదంగా కనిపించిన ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపించారు. గుర్తించిన లోపాలపై మెరుగుదల నోటీసులు జారీ చేసేందుకు అధికారులు సిఫార్సు చేశారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాల్లో ఆహార భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హోటల్ నిర్వాహకులకు సూచించారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై జనసేన కసరత్తు

దశ, సూర్యాపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా సూర్యాపేటలో ఆదివారం సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గాదల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, పట్టభద్రులు, జనసైనికులు, వీర మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటర్ల నమోదు, ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకాలు, నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టభద్రులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని నాయకులు నిర్ణయించినట్లు తెలిపారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



దశ, రామన్నపేట: రామన్నపేట మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను, ఆశయాలను స్మరించుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు సంగిశెట్టి సుదర్శన్, అధ్యక్షులు ఈడెం శ్రీనివాసరాధా, మాజీ డీసీఎంఎస్ జిల్లా డైరెక్టర్ జెల్లా వెంకటేష్, పట్టణ అధ్యక్షులు రచ్చ యాదగిరి, కార్యదర్శి నాగభూషణం, పున్న వెంకటేశం, వనం చంద్రశేఖర్, మండల చేనేత సహకార సంఘాల అధ్యక్షుడు పెండం వేణు, వరం సుధాకర్, వనం కిష్టయ్య, జిల్లా దత్తాత్రి, దొంత నాగరాజు, సూర్యపెళ్లి చంద్రమోహన్, గంజి అశోక్, వనం విటల్, రచ్చ దయాకర్, గంజి చంద్రయ్య, పాండు, భవనాఋషి, బోడ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో ఫలక్‌నామా, పల్నాడు, నారాయణాద్రి రైళ్లను పునరుద్ధరించాలి



దశ, రామన్నపేట: రామన్నపేటలో గతంలో నిలిపివేసిన ఫలక్‌నామా, పల్నాడు, నారాయణాద్రి రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ రామన్నపేట బీజేపీ నాయకులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి రైళ్ల పునరుద్ధరణపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి స్పందిస్తూ సంబంధిత అధికారులతోమాట్లాడిరామన్నపేటలోఆయారైళ్లకునిలుపుదలకల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, సికింద్రాబాద్ ఇన్‌చార్జి వీరెల్లి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నకిరేకంటి మొగులయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు వనం అంజయ్య, జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణగౌడ్, మండల అధ్యక్షుడు బండ మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమిటీ హాల్ కోసం ఎమ్మెల్యేకు విశ్వకర్మల వినతి

దశ, అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన విశ్వకర్మ కులస్తులు కమిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు సీహెచ్ భాస్కర్‌చారి ఆధ్వర్యంలో దాదాపు 150 మంది విశ్వకర్మ కులస్తులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. కమిటీ హాల్ కోసం స్థలం కేటాయించాలని కోరగా.. అబ్దుల్లాపూర్‌మెట్ సర్పంచ్ విజయ శ్రీశైలం గౌడ్‌తో స్థలాన్ని పరిశీలించి, అనువైన ప్రదేశాన్ని గుర్తించాలని ఎమ్మెల్యే సూచించినట్లు వారు తెలిపారు. అలాగే మాజీ ఎంపీపీ బుర్ర రేఖ మహేందర్‌గౌడ్, బుర్ర చంద్రం గౌడ్, వార్డు నంబర్ మహేందర్‌లను కలిసి కమిటీ హాల్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కర్‌చారి, యు. మధుసూదనాచారి, వి. రాజేంద్రచారి, ఎస్. రాజమౌళిచారి, వి. చంద్రయ్యచారి, ఎస్. సత్తయ్యచారి, ఎస్. సురేంద్రచారి, దినేష్‌చారి, కృష్ణచారి, శ్రవణ్‌చారి తదితరులతో పాటు సుమారు 150 మంది విశ్వకర్మ కులస్తులు పాల్గొన్నారు.



తార్నాక సేవ-25లో 9, 10వ సేవా కార్యక్రమాలు

❖ *ఉచిత ఆరోగ్య పరీక్షలు.. మందులు, కళ్లద్దాల పంపిణీ..*

❖ *ప్రజల అవసరాలకు స్పందించేలా సేవా కార్యక్రమాలు కొనసాగింపు..*

దశ ఓయూ: సేవా పక్వాడా స్ఫూర్తితో నిర్వహిస్తున్న 'తార్నాక సేవ-25' కార్యక్రమాల్లో భాగంగా మహంకాళి జిల్లా ఇంటలెక్చువల్ సెల్ ఇంచార్జ్ శ్రీరామ్ వెంకటేష్ ఆధ్వర్యంలో 9వ, 10వ సేవా కార్యక్రమాలను హనుమాన్ నగర్ లో నిర్వహించారు. ఇందులో భాగంగా ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలను పంపిణీ చేశారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు అవసరమైన వారికి ప్రత్యక్షంగా సహాయం అందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తార్నాక డివిజన్ అధ్యక్షులు కరుణాకర్, కృష్ణ గౌడ్, గీతా సెల్ కన్వీనర్ అలేటి అనుష, సరోజ్, ఆకుల శ్రీనివాస్, ప్రకాశ్ గౌడ్, మోహన్, శశి, సుబ్బారావు, పోచయ్య యాదవ్, మేకల సారంగపాణి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, హనుమాన్ నగర్ ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలకు శ్రీరామ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో 'తార్నాక సేవ-25'లో మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.న్

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



దశ, రంగారెడ్డి: కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శాఖాధికారి కేషు రామ్ జ్యోతి ప్రజ్వలన చేసి, కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.63 లక్షలకు గణనాథుడి లడ్డూ వేలం..పిగ్లిపూర్‌లో ఘనంగా వేలం



దశ, అబ్దుల్లాపూర్‌మెట్ : పిగ్లిపూర్ గ్రామంలో హనుమాన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణనాథుడి లడ్డూ వేలం పాటలో బండేల శేఖర్-కళ్యాణి దంపతులు రూ.1,63,001లకు లడ్డూను దక్కించుకున్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేలం కార్యక్రమంలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, హనుమాన్ యూత్ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిగ్లిపూర్‌లో రూ.1.63 లక్షలకు లడ్డూ వేలం



దశ, అబ్దుల్లాపూర్ మెట్ : గ్రామంలో హనుమాన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేశుడి నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. నిమజ్జనానికి ముందు నిర్వహించిన లడ్డూ వేలం పాటలో బండెల శేఖర్ రూ.1,63,001లకు లడ్డూను కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూత్ క్లబ్ సభ్యులు గ్రామ ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ విజ్ఞప్తి



దశ ఓయూ: నల్గొండ-ఖమ్మం-వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన పేరును పరిశీలించి అవకాశం కల్పించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి బయోడేటా అందజేసి విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా విద్యార్థి నాయకుడిగా, తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడిగా పనిచేశానని, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉద్యమాల సందర్భంగా జైలుకు వెళ్లి పలు కేసులు ఎదుర్కొన్నానని తెలిపారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ9లో జర్నలిస్టుగా, హైకోర్టు న్యాయవాదిగా, సుప్రీంకోర్టు ఎన్‌రోల్డ్ అడ్వకేట్‌గా సేవలందించానన్నారు. పలు సామాజిక, వామపక్ష ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేసిన తనకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్రప్రధాన కార్యదర్శి మాదు సత్యంగౌడ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులే పాఠశాలకు ఆస్తి



దశ సూర్యాపేట ప్రతినిధి : పూర్వ విద్యార్థులే పాఠశాలకు ఆస్తి అని జిల్లా ఎస్పీ నరసింహ, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జడ్పీఎంపీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు గుంటకండ్ల దామోదర్‌రెడ్డి అధ్యక్షతన 8వ వార్షికోత్సవ సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు, సమాజానికి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు.

తాము చదువుకున్న పాఠశాలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవడం స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను చిన్ననాటి నుంచే గుర్తించి ప్రోత్సహించడంతో పాటు విద్యతోపాటు మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు.పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం ద్వారా పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడంతో పాటు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థి దశలో నేర్చుకున్న క్రమశిక్షణ, విలువలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడతాయని తెలిపారు.ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన పూర్వ విద్యార్థులను ప్రతిభా పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకుని పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని, విద్యార్థి దశలోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి తాటి చంద్రశేఖర్, కన్వీనర్ డాక్టర్ వేణుధర్, విద్యాసాగర్, డాక్టర్ పటేల్ నరసింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, చిలువేరు రఘురాం, రాఘవాచారి, మహేందర్‌రెడ్డి, ముత్తంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ కావడం ఉద్యోగం కాదు.. బాధ్యత

నీట్ ర్యాంక్ బాధ్యతకు ప్రారంభం: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

దశ, ఓయూ: నీట్ 2026లో ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్‌లో సీట్లు పొందిన విద్యార్థులు భవిష్యత్‌లో మంచి వైద్యులుగా ఎదగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. నాచారంలోని డీపీఎస్ పాఠశాలలో తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ మెడికల్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ సక్సెస్ మీట్ నీట్ 2026 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నెలల తరబడి చేసిన కష్టం, క్రమశిక్షణ, ఓపిక, నిరంతర సాధన ఫలితంగానే నీట్‌లో విజయం సాధ్యమైందన్నారు. నీట్ ర్యాంక్ ప్రయాణానికి ముగింపు కాదని, బాధ్యతకు ప్రారంభమని పేర్కొన్నారు.వైద్య వృత్తిలో జ్ఞానంతో పాటు మానవత్వం, సేవాభావం, నైతిక విలువలు ఎంతో ముఖ్యమని తెలిపారు. పేదలు, గ్రామీణులు, బలహీన వర్గాల ఆరోగ్య అవసరాలను గుర్తించి సేవలందించే వైద్యులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

వైద్య విద్యలో సీటు పొందిన పేద విద్యార్థులకు ఫీజుల భారం తగ్గించేందుకు తాను సహకరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రుల త్యాగం, ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. పిల్లలను ఇతరులతో పోల్చకుండా వారి ఆసక్తి, సామర్థ్యాలను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ విజయ ప్రస్థానం, ఎదుర్కొన్న కష్టాలను వివరించారు.కార్యక్రమంలో అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ మల్క నవీన్‌కుమార్, అధ్యక్షుడు మల్లోజు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఉపాధ్యక్షుడు రమేష్‌కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీరామ్ వెంకటేష్ పుట్టినరోజు వేడుకలు

బీజేపీ నేతల శుభాకాంక్షలు; సేవా కార్యక్రమాలపై వెల్లడి



దశ, ఓయూ: బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఇంటలెక్చువల్ సెల్ ఇంచార్జ్ శ్రీరామ్ వెంకటేష్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం తార్నాకలోని ఆయన నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో బ్లాక్ ఫంగస్‌తో పోరాడి, దాదాపు ఎనిమిది నెలలు యశోద ఆసుపత్రిలో చికిత్స పొందానని తెలిపారు. కిడ్నీ డయాలసిస్ సహా అనేక సమస్యలను ఎదుర్కొని కోలుకున్నానని, తనకు ఇది పునర్జన్మ లాంటిదని అన్నారు. గతంలో 20 ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉన్నానని, ఎనిమిది నెలల క్రితం బీజేపీలో చేరానని తెలిపారు. నరేంద్ర మోదీ స్ఫూర్తితో తార్నాకలో 25 సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే లక్ష్యంతో ఇప్పటికే 10 కార్యక్రమాలు పూర్తిచేశామని, మరో 15 కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి హాజరైన మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, నాయకులు, యువత, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేవరకు మేరు సంఘం ముందుండి పోరాడుతుంది

43వ రోజు రిలే నిరాహార దీక్షలో కూర్చున్న మేరు సంఘం పట్టణ అధ్యక్షుడు మునగాల సతీష్



దశ, సూర్యాపేట ప్రతినిధి : సూర్యాపేట జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బుల్లెట్ ట్రైన్ రావాల్సిన అవసరం ఉందని బుల్లెట్ ట్రైన్ సూర్యాపేటకు వచ్చేవరకు మేరు సంఘం ముందుండి పోరాడుతుందని సూర్యాపేట పట్టణ మేరు సంఘం అధ్యక్షుడు మునగాల సతీష్ అన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేందుకు ధర్నాచౌక్ వద్ద నిర్వహిస్తున్న 43వ రోజు దీక్షలో ఆదివారం మేరు కులస్తులతో కలసి నిరాహార దీక్షలో కూర్చుని మాట్లాడారు. బుల్లెట్ ట్రైన్ వస్తే ఈ ప్రాంతమంతా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. మొదట ప్రకటించినట్లుగా శంషాబాద్ నుంచి చెన్నై వరకు జాతీయ రహదారి 65 కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ ఆలైన్ మెంట్ మార్చాల్సిందిగా కోరారు. బుల్లెట్ ట్రైన్ సాధన కోసం నిర్వహించే ఉద్యమ కార్యచరణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. బుల్లెట్ ట్రైన్ కోసం నిర్వహించే ఏ కార్యక్రమానికైనా మేర సంఘం పూర్తి మద్దతు ఉంటుందన్నారు.

రూ.1.08 లక్షలకు నాచారం నేతాజీ క్లబ్‌లడ్డూ..

దక్కించుకున్న బీఆర్ఎస్ నేత ఊటుకూరి రాజేష్‌గౌడ్



దశ, ఓయూ: నాచారం నేతాజీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గణనాథుడి లడ్డూ వేలం పాట ఉత్సాహంగా జరిగింది. ఈ వేలంలో బీఆర్ఎస్ నాయకుడు ఊటుకూరి రాజేష్‌గౌడ్ రూ.1.08 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అలాగే కమిటీ ఆధ్వర్యంలోని చిన్న లడ్డూను ఊటుకూరి సందీప్‌గౌడ్ రూ.35 వేలకు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మేడాల మల్లికార్జున్‌గౌడ్‌తో పాటు నేతాజీ కమిటీ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

తార్నాకలో భారీ ఉచిత వైద్య శిబిరం



దశ ఓయూ: తెలంగాణ రాష్ట్ర వంజారి సంఘం ప్రాంగణంలో వంజారి వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.సమాజంలో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించేందుకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. వంజారి సమాజ సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర వంజారి సంఘం అధ్యక్షుడు కాలేరు నరేష్, కాలేరు విశ్వనాథం, మాజీ ప్రధాన కార్యదర్శి కె. వెంకటేశం, సభ్యులు రాజ్‌కుమార్, నర్సింగ్‌రావు, అజయ్, శ్రీనివాస్, వంజారి సంఘం మాజీ సభ్యులు రామోజీ, కారిపె ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు వేసి గెలిపించాలి

ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు.



దశ సూర్యాపేట ప్రతినిధి : ఉమ్మడి ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని, పట్టభద్రులు తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డాక్టర్ గడల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎం.జెడ్. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జనసేన పార్టీని బలోపేతం చేయడంతో పాటు అన్ని వర్గాలకు న్యాయం చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు అందకపోవడం, పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం వంటి సమస్యలను ప్రస్తావించారు. రాజకీయ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

తనను శాసనమండలికి పంపితే పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలను మండలిలో ప్రశ్నిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిరియాల రామకృష్ణ, సాయి శిరీష, ఎడమ రాజేష్, సరికొప్పుల విజయలక్ష్మి, నాగేశ్వరరావు, రామగిరి శివసాయి, అరవింద్ కుమార్, పసుపులేటి రామారావు, సాయినాయుడు, ఏవీ రావు, అజయ్, 4 నియోజకవర్గాలకు చెందిన జనసేన నాయకులు పాల్గొన్నారు.